క్లుప్తంగా

కార్మికులకు పనికితగ్గ వేతనం ఇవ్వాలి



రాజాపూర్: పంచాయతీల్లో కార్మికులకు పనికితగ్గ వేతనం ప్రభుత్వం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ లక్ష్మీదేవికి అందజేశారు. కార్యక్రమంలో పాశం నర్సింహులు, రాము, షబ్బీర్‌అలీ, ఆంజనేయులు, రఘు, యాదగిరి పాల్గొన్నారు.

వినియోగదారులకు సకాలంలో సరుకులు



మిడ్జిల్: మండలంలోని అన్ని చౌకధర దుకాణాలలో సకాలంలో ప్రజలకు రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దార్ రాజునాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. మండలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అందరూ తప్పకుండా సమయపాలన పాటించాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐ రామాంజనేయులు, డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



దేవరకద్ర రూరల్: అడవి అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ తన తండ్రి మహ్మమద్ అలీ జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన అడవి ఆజిలాపూర్, నాగారం, వెంకటాయపల్లి చెందిన పాఠశాల విద్యార్థులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం పరీక్షాపే చర్చ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 10 సీబీఎస్‌ఈ పాఠశాలలకు చెందిన 100మంది పాల్గొని వివిధ రకాల చిత్రాలను వేశారు. ఇందులో ఐదుగురిని విజేతలుగా ప్రకటించారు. మొదటి బహుమతి అనీష్ బ్రహ్మ గెలాక్సీ స్కూల్, రెండో బహుమతి మనస్విని మౌంట్‌బాసిల్, మూడో బహుమతి తులసీ మౌంట్‌బాసిల్ పాఠశాల, నాలుగో బహుమతి సాయిచరణ్ మౌంట్‌బాసిల్, ఐదో బహుమతి జయనందన్ గీతాశ్రీ స్కూల్ గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాపార మోసాలను అరికట్టాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వ్యాపారాల్లో చేస్తున్న మోసాలను అరికట్టి ప్రజలను రక్షించాలని కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అడమ్స్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యాపారస్తులు ప్రజలను చేసే మోసాలపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

బాలానగర్: మండలంలోని పెద్దరేవల్లిలో బుధవారం నుంచి తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్వామివారి కల్యాణం, 25న రథోత్సవం, 26న శకటోత్సవం, 27న చక్రతీర్థ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే భక్తులను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

- ఫిబ్రవరి 12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- విద్యార్థులకు 45రోజుల పాటు రక్త పరీక్షలు
- కలెక్టర్ రవినాయక్



నులి పురుగుల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

పాలమూరు: పిల్లలలో నులిపురుగులను నివారించేందుకుగాను ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వాటితో బాధపడతారని తెలిపారు. ఇందుకు పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆయన కోరారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు మాత్రలు వేయాలని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు వీటిని వేయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పిల్లలు మాత్రలను ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించవద్దన్నారు. 12వ తేదీన మాత్రలు వేయని వారికి 19వ తేదీ మాప్ అప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

జిల్లాలో 19ఏళ్ల లోపు పిల్లలు 2,45,789 ఉన్నారని, రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్రం నలిపి వేయించాలని, రెండు నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు ఒక మాత్రను మింగించాలని, 3 నుంచి 19ఏళ్ల వరకు పిల్లలకు చప్పరించేలా వేయించాలని తెలిపారు. జిల్లాలో 2.88 లక్షల మాత్రలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సైతం ఈ మాత్రలు వేయించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తహీనతపై చర్యలు

ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకుగాను ఈ 24వ తేదీ నుంచి 45 రోజులపాటు 'ఎనీమియా ముక్త మహబూబ్‌నగర్' కార్యక్రమం కింద వారికి పరీక్షలు నిర్వహిస్నుట్లు కలెక్టర్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఈ విషయంపై సమీక్షించారు. ఇందులో భాగంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను మొదలుకొని ఇంటర్ చదివే విద్యార్థుల వరకు ఆర్బీఎస్‌కే బృందాల ద్వారా రక్త, ఇతర పరీక్షలు నిర్వహించి వారిని రక్తహీనత ఉంటే గుర్తించడం జరుగుతుందని, వారందరికీ మందులు ఇచ్చి, తీవ్రత ఎక్కువ ఉన్న వారిని ఆస్పత్రికి పంపించడం ద్వారా వారికి చికిత్స చేయిస్తామన్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, ఆరోగ్యశాఖ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఏ ఒక్క విద్యార్థిని వదలకుండా అందరికీ పరీక్షలు నిర్వహించాలన్నారు. జనవరి 30 నుంచి రెండు వారాలపాటు కుష్టు నివారణకై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఒంటిపై తెల్ల మచ్చలు ఉన్నవారు. స్పర్శ లేకుండా ఉన్న వారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించడం ద్వారా చికిత్స ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 30న జిల్లాలోని అన్ని గ్రామాలలో నిర్వహించే గ్రామ సభల సందర్భంగా ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలని ఆదేశించారు. కుష్టు వ్యాధికి గురైన వారిపై వివక్ష చూపించకూడదని, వారు వ్యాధిబారి నుంచి త్వరగా కోలుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

గండేడ్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై ఉపాధి హామీ సిబ్బంది, డీఆర్పీ, ఎస్ఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. 2022–23కు సంబంధించి ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2022–23కి రూ.8కోట్ల68వేల పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు, హరితహారం, క్రీడా ప్రాంగణాలు తదితర పనులు చేపట్టామన్నారు. వీటికి సంబంధించి గ్రామాల్లో సామాజికి తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల వివరాలు సేకరిస్తారన్నారు. వీరికి టీఏ, ఎఫ్ఏలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ హరిశ్చంద్రుడు, టీఏలు, ఎఫ్ఏలు, డీఆర్పీ, ఎస్ఆర్పీలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం తీసుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని వికలాంగుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత కోరారు. మంగళవారం మండలంలోని దమగ్నాపురంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళా దివ్యాంగులపై పలు రకాల దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన చెందారు. ప్రభుత్వం 2016 చట్టం అమలు చేసి దివ్యాంగులకు న్యాయం చేయాలన్నారు. ముఖ్యంగా సదరం క్యాంపు తేదీలను పొడిగించి అర్హులైన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల బయట ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు అంగ వైకల్యంతో పనులు చేసి ఉపాధి పొందని పరిస్థితిలో ఎందరో ఉన్నారన్నారు. వారికి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందించి అండగా నిలవాలని కోరారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అంత్యోదయ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, దివ్యాంగులకు కమ్యూనిటీ భవనాలు, చదువుతో సంబంధం లేకుండా త్రీ వీలర్ స్కూటీలు, రూ.5లక్షల వివాహ ప్రోత్సాహం, స్థానిక సంస్థలు, చట్ట సభల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సలహాదారులకు సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇటీవలే ప్రభుత్వ సలహాదారులుగా నియామకమైన వేం నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌తోపాటు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, మధుసూదన్‌రెడ్డి సన్మానం చేశారు. శాలువాలతో వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లురవి కలిసిన నాయకులు

రాజాపూర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా ఎంపికైన మల్లురవిని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో యాదయ్య, బుగ్గయ్య, రాజు తదితరులు ఉన్నారు.

గెలుపొందిన వారికి బహుమతులు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ, వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య వక్తగా కరుణాకర్ హాజరై ప్రసంగించారు. యువత వివేకానంద, నేతాజీని స్ఫూర్తిగా తీసుకుని, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వేణు, తేజ, మల్లికార్జున్, సతీష్, శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొక్తదీర్ బాబా ఉర్సు



గంధాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ మొక్తదీర్ బాబా దర్గా వద్ద మంగళవారం రాత్రి ఉర్సు నిర్వహించారు. మొక్తదీర్ బాబా ఇంటి నుంచి గంధాన్ని బయటకు తీశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తిపాటలకు యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం దర్గా వద్దకు చేరుకున్న తర్వాత గంధంను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నాయకులు ప్రార్థనలకు హాజరయ్యారు. అనంతరం మొక్తదీర్ బాబా ఇంటి వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శెట్టిశేఖర్, మదీనా జమీర్, తాజోద్దీన్, మైనోద్దీన్, టైలర్ కలీం, పాష, ఖాదర్, సలాం, ఖలీల్, ఆబిద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని వినతి

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో తీసిన గోతులను పూడ్చాలని, ప్రమాదభరితంగా మారిన మట్టి దిబ్బలను తొలగించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ షేక్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, కృష్ణయ్య ఫిర్యాదు చేశారు. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, రోడ్ల మరమ్మతు కారణంగా రాకపోకలు ఇబ్బందిగా మారాయన్నారు. స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం సమీపంలో దేవరకద్ర, ఆత్మకూర్ రహదారికి పక్కన 11కేవీ విద్యుత్ స్తంభం నెల రోజులుగా పగిలిపోయి ప్రమాదభరితంగా మరింది. స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారి గుండా తిరిగే వాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చూసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ చెందిన తంగెళ్లపల్లి నర్సమ్మ (54) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగ రూ.5వేలు అందించారు. కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, వెంకటేష్, శాలయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలో ఎల్లమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వకుళసాలి సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక మర్గమ్మ గుడి నుంచి భక్తిశ్రద్ధలతో పల్లకిసేవను నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహానైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



నేతాజీ జీవితం ఆదర్శం



జడ్చర్లలో నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, యువజన సంఘం నాయకులు



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

జడ్చర్ల టౌన్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. పట్టణంలోని నేతాజీ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద నేతాజీ యువజన సంఘం, ఏబీవీపీతోపాటు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, శివకుమార్ నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో రవిశంకర్, జీవన్‌గుండప్ప, రమేష్, లత, పవన్, జయప్రకాష్, ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ, అధ్యాపకబృందం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కావేరమ్మపేట చావిడి వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి యువజన సంఘం నాయకులు, కావేరమ్మపేట వాసులు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

రాజాపూర్: మండల కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఏబీవీపీ నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, రాఘవేందర్, మణికంఠ, పవన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



నవాబుపేటలో..

నవాబుపేట: నేతాజీ జీవితం యువతకు ఆదర్శమని సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు, యువజన సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నర్సింహులు, వెంకటేశ్వరప్ప, చిన్నస్వామి, శివ, రాఘవేందర్, నర్సింహ, సత్యం, వెంకటయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండల కేంద్రంలోని ది ఎవరెస్ట్ స్కూల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు.

బతుకమ్మ చీరలు మూలకేనా?



నవాబుపేట మహిళా సమాఖ్య భవనంలో ఉన్న బతుకమ్మ చీరలు

- ఎన్నికల కోడ్ రాకతో నిలిచిన పంపిణీ
- రూ.లక్షల ప్రజాధనం వృథా

నవాబుపేట: గత ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలను అందించేది. కాగా అవి అందించేందుకు మండలానికి, గ్రామాలకు చేరిన చీరలు ఎన్నికల కోడ్‌తో అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఈ చీరలు పంచాయతీలు, మహిళ సమాఖ్య భవనాల్లో వృథాగా మగ్గుతున్నాయి.

21,429 చీరలు

మండలానికి 21,429 చీరలు వచ్చాయి. వీటిని 54 గ్రామాల మహిళలకు అందించాల్సి ఉండగా, పంపిణీకి సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల కోడ్‌తో నిలిచింది. దీంతో అవి అలాగే పడి ఉన్నాయి. కేవలం మండలానికి అందించిన చీరలే రూ.లక్షలు ఖరీదు చేస్తే జిల్లా మొత్తానికి అందించిన చీరల విలువ చెప్పనక్కర లేదు. చాలా మండలాల్లో సైతం బతుకమ్మ చీరలు పంపిణీకి నోచుకోలేదు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి చీరలను మహిళలకు అందించేలా చూడాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల కోడ్ రావడంతో..

చీరలు మండలానికి రెండు విడతలుగా వచ్చాయి. మొదట్లో చీరలు తక్కువగా 11 వేలు వచ్చాయి. అవి సరిపోవని మొత్తం వచ్చాక పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో రెండో విడత చీరలు వచ్చే వరకు వేచి చూశాం. కాగా రెండు విడతలలో 20 వేలకు పైగా చీరలు వచ్చాయి. గ్రామాలకు సైతం చేరవేశాం. తీరా వాటిని పంపిణీ చేస్తున్న తరుణంలో కోడ్ రావటం ఎక్కడికక్కడే నిల్వ ఉంచాల్సి వచ్చింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే నిర్ణయం తీసుకుంటాం.

– రమాదేవీ, వెలుగు సీసీ, నవాబుపేట

మాదిగలకు రెండు స్థానాలు ఇవ్వాలి

హన్వాడ: మాదిగలు రాష్ట్రంలో 60లక్షల జనాభా ఉన్నారని, ఇందుకు గాను రెండు ఎంపీ స్థానాలను కేటాయించాలని దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల దండోర నాయకులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధును పునరుద్ధరించి, దళిత కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజోయే రోజుల్లో ప్రభుత్వ తీరుపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి డీఐఈఓపై బదిలీ వేటు

వనపర్తి: వనపర్తి డీఐఈఓ జాకీర్ హుస్సేన్‌పై బదిలీ వేటు పడింది. నిబంధనలకు విరుద్ధంగా భార్యను తాను ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఉర్దూ మీడియం కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా నియమించారన్న కారణం చూపుతూ నల్లగొండ జిల్లా హాలియాకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన భరత్, సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ శ్రుతి ఓఝా మహబూబ్‌నగర్ డీఐఈఓతో విచారణ జరిపించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు నిజమని నివేదిక అందడంతో ఆయనను బదిలీ చేయడంతో పాటు ఆయన భార్య గెస్ట్ లెక్చరర్‌గా ప్రభుత్వం నుంచి పొందిన మొత్తం నగదును వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కనీస వసతులు కల్పిస్తాం



వాటర్ ప్లాంట్ వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గత ప్రభుత్వాలు రెండున్నర సంవత్సరాలుగా పాడైన ఆర్‌ఓ ప్లాంట్‌ను మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం వహించారని, కనీసం విద్యార్థుల దాహార్తి తీర్చలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇక నుంచి పాఠశాలలు, కళాశాలల్లో వసతుల కల్పనపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, భగవంతాచారి, లెక్చరర్లు శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.